# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 60 | శనివారం, 16 నవంబర్ 2024 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## మేం అధికారంలోకి వచ్చాక మీ సంగతి చెబుతాం

- ఈరోజు కొడంగల్ తిరగబడ్డది.. రేపు తెలంగాణ తిరగబడుతుంది
- ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దు
- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారు
- కొడంగల్‌ను అల్లుడి కంపెనీకి రాసివ్వాలని సీఎం ప్రయత్నాలు చేస్తుండు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

మేం అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డిని ఏం చేయాలో తమకు తెలుసని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. ఈరోజు కొడంగల్ తిరగబడ్డదని, రేపు తెలంగాణ తిరగబడుతుందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని ధైర్యం చెప్పారు. లగచర్ల ఘటనలో అరెస్టై.. సంగారెడ్డి జైలులో ఉన్న వారితో కేటీఆర్ శుక్రవారం ములాఖత్ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తిరుపతిరెడ్డి ఫోన్‌లో ఆదేశాలిస్తుంటే.. అధికారులు పాటిస్తున్నారన్నారు. కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రెడ్డి రాబందులా మారారని మండిపడ్డారు. గతంలో ఫార్మా కంపెనీలను విమర్శించిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఫార్మా కంపెనీలు కావాలని చెప్పడమే కాకుండా వేలాది ఎకరాలు కావాలంటున్నాడని మండిపడ్డారు. లగచర్ల ఘటన సమయంలో ఓ వ్యక్తి కులగణనలో పాల్గొన్నారని, అతనిని కూడా అరెస్ట్ చేశారని ధ్వజమెత్తారు. ఓ ఐటీఐ విద్యార్థిని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. కలెక్టర్ లగచర్లకు

మిగతా 2లో..

## సింపతీ కోసమే కేటీఆర్ అరెస్ట్ డ్రామా

### ఆయనను అరెస్ట్ చేసేందుకు మేం కుట్ర చేయట్లే..

- లగచర్ల ఘటనలో కలెక్టర్‌ను చంపే కుట్ర జరిగింది
- విచారణ పూర్తయ్యాక అన్ని విషయాలు బయటకొస్తాయి
- మంత్రి శ్రీధర్‌బాబు సంచలన వ్యాఖ్యలు



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

ప్రజల్లో సానుభూతి కోసమే కేటీఆర్ పదే పదే అరెస్ట్ అంటూ మాట్లాడుతున్నారని అన్నారు మంత్రి శ్రీధర్ బాబు. లగచర్ల ఘటనలో కలెక్టర్‌ను చంపే కుట్ర జరిగిందని సంచలన ఆరోపణలు చేశారు. అలాగే, రైతుల విషయంలో ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారం ఆపాలని డిమాండ్ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు సచివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. లగచర్ల ఘటనలో ఎవ్వరనీ వదిలిపెట్టం. దీనిపై విచారణ

మిగతా 2లో..



## 'కోటి దీపోత్సవం' వేడుకకు సీఎం రేవంత్

04



కేసీఆర్ బాటలోనే..

## రేవంత్‌రెడ్డి

### ఆరు గ్యారంటీలు అమలు చేశామని సీఎం అబద్ధాలు చెబుతుండు

- కాంగ్రెస్ సర్కార్ చేపట్టిన చర్యలతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు
- ప్రజలకు మాటలు చెబుతూ.. మూటలు పార్టీకి ముట్టజెప్పుతున్నరు
- రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలే..
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

02

## పండిన ప్రతి గింజను కొంటాం

- సన్న వడ్లకు బోనస్ కూడా ఇస్తాం
- ఈ ఏడాది వరి సాగులో తెలంగాణే టాప్
- రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాల మాఫీపై త్వరలోనే ప్రకటన చేస్తాం
- రైతు భరోసా సబ్ కమిటీ నివేదిక రాగానే రైతులకు అందజేస్తాం
- రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



02



### ఏఐసీసీలో ఖర్గే ఓ బొమ్మ మాత్రమే..

- నాడు మన్మోహన్ సింగ్‌ను ఎలా వాడుకున్నారో.. నేడు ఖర్గే కూడా అలాగే వాడుకుంటున్నరు
- ఎవరడ్డుకున్నా వక్ఫ్ బోర్డు సవరణ జరుగుతుంది
- శీతాకాల సమావేశంలో వక్ఫ్ బోర్డు బిల్లు పాస్ అవుతుంది
- ప్రజలను ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ పీడిస్తున్నాయ్
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


02

### రాజకీయ కుట్రతోనే కులగణనపై అపోహలు

- సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టొచ్చు
- తప్పుడు ప్రచారం చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటాం
- మంత్రి పొన్నం ప్రభాకర్



02




### ఫిలిప్పీన్స్‌లో తెలుగు యువతి మృతి

- బర్త్ డే రోజే అనుమానాస్పదస్థితిలో మెడికో మరణం

02

## నగరంలో సెమీ కండక్టర్స్ ఆర్అండ్‌డీ సెంటర్

- వచ్చే ఐదేండ్లలో 500 మందికి ఉపాధి కల్పించే లక్ష్యం..
- ఇండియాలో ఎన్నో ప్రధాన నగరాలను కాదని హైదరాబాదులో పెట్టుబడులు



02



02

### 'పట్నం' కోసం రంగంలోకి బీఆర్ఎస్ లీగల్ టీమ్..

- ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరుతూ పిటిషన్
- పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు రిజిస్ట్రీ

## కేసీఆర్‌ను కేటీఆర్ నిర్బంధించారు

- అందుకే ఏడాదిగా బయటకు రావడం లేదు..
- లగచర్లలో భూమిలేని వారే అధికారులపై దాడి చేశారు
- కేటీఆరే ఉద్దేశపూర్వకంగా ఆ దాడి జరిపించారు
- పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధం
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్



04

# ఫిలిప్పీన్స్‌లో తెలుగు యువతి మృతి

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

డాక్టర్ అన్న కోరికతో విదేశాలకు వెళ్లిన 20 ఏళ్ల యువతి అనూహ్య మరణం అనేక అనుమానాలకు తావిస్తోంది. తెలంగాణకు కెందిన స్నిగ్ధ వైద్య విద్య అభ్యసించ డానికి ఫిలిప్పీన్స్ వెళ్లింది. పుట్టినరోజు నాడే అనుమానాస్పదంగా మృతి చెందడంతో శోక సంద్రంలో మునిగిపోయింది. పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో పంచాయతీ పరిధిలో నివాస ముంటున్నారు చింత అమృత్ రావు. మెదక్‌లోని ట్రాన్స్‌కో డీఈ అమృతరావు కుమార్తె స్నిగ్ధ రెండేళ్ల క్రితం ఎంబీబీఎస్ చేసేందుకు ఫిలిప్పీన్స్ వెళ్లింది. పర్పెచువల్ హెల్ప్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఏం జరిగిందో తెలియదు కానీ పుట్టిన రోజు విషెస్ చెబుతామని ఫోన్ చేస్తే అనారోగ్యానికి గురైన ఆమెను ఆసుపత్రికి తరలించే సమయానికి కన్నుమూసినట్టు తెలుస్తోంది. ఏం జరిగిందో అర్థం కావడం లేదని, తమ పాప చాలా ధైర్యవంతురాలని స్నిగ్ధ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరపాలని, తమ బిడ్డ మృతదేహాన్ని ఇంటికి చేర్చేందుకు సాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు ఫిలిప్పీన్స్‌లోని భారత రాయబార కార్యాలయంతో మాట్లాడిన అధికారులు ఆమె మృతదేహాన్ని భారత దేశానికి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. స్నిగ్ధ మరణానికి గల కారణాలపై వివరాలు తెలియాల్సి ఉంది.

# కుల గణన సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

సోషల్ మీడియాలో సమగ్ర సర్వేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగటం లేదని స్పష్టం చేశారు. 87వేల ఎన్యుమారెట్‌లను పెట్టి సర్వే జరిపిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 30శాతం సర్వే పూర్తి అయ్యిందని తెలిపారు. సర్వే వల్ల ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కొండపాక మండలం దుద్దేడ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ...దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందన్నారు. సర్వే కావాలని కోరిన వారే నేడు కనబడటం లేదని చెప్పారు. సర్వేను అడ్డుకున్న వారిపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా అందరికీ గ్రంథాలయ వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి పాల్గొన్నారు.



# కేసీఆర్ బాటలోనే.. రేవంత్‌రెడ్డి

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో ఆరు గ్యారంటీలు అమలు చేశామని, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. సికింద్రాబాద్ టూరిజం ప్లాజాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. మాటలు ప్రజలకు.. మూటలు పార్టీకి అన్నట్లుగా.. కేసీఆర్ బాటలోనే రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రలో ఏ ముఖం పెట్టుకుని ప్రచారం చేస్తున్నారని ప్రశ్నించారు. అశోక్‌నగర్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇంకా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించలేదు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం చెందిందన్నారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుచేయలేదని విమర్శించారు.

**ఈ నెల 21 నుంచి 24 వరకు 'లోక్‌మంథన్'...**

శిల్పకళావేదికలో ఈనెల 21 నుంచి 24 వరకు లోక్ మంథన్ నిర్వహించనున్నట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బేగంపేట పర్యాటక



భవన్‌లో లోక్ మంథన్‌పై కేంద్రమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈ ఏడాదిలో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవంగా లోక్‌మంథన్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 21న స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలను మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, 22న లోక్‌మంథన్‌ను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ప్రారంభిస్తారని కిషన్‌రెడ్డి వెల్లడించారు. అదేవిధంగా 24న జరిగే ముగింపు కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, గజేంద్ర సింగ్ షేకావత్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, విదేశీ అతిథులు హాజరుకానున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

# పండిన ప్రతి గింజను కొంటాం

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

రూ.2లక్షలకు పైబడిన వాళ్ళ రుణమాఫీ పై త్వరలోనే ప్రకటన చేస్తామని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుడ్ న్యూస్ చెప్పారు. రైతు భరోసా సబ్ కమిటీ నివేదిక రాగానే రైతులకు అందజేస్తామన్నారు. ఈ ఏడాది వరి సాగులో తెలంగాణ టాప్ స్థానంలో నిలిచిందన్నారు. ఒక కోటిన్నర లక్షల ఎకరాల దిగుబడితో పంజాబ్ రాష్ట్రాన్ని వెనక్కి నెట్టామన్నారు. గతంలో 41లక్షల ఎకరాలల్లో ఉన్న దొడ్డు ధాన్యం ఈ ఏడాది 21లక్షలకు పడిపోయిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సన్న ధాన్యం దిగుబడి పెరిగిందని, దేశ వ్యాప్తంగా సన్న ధాన్యానికి డిమాండ్ పెరిగిందన్నారు. 25 జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో ఈ రోజు నాటికి 17 జిల్లాల్లో మాత్రమే జరిగాయన్నారు. 9.7 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ళు ఇప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా చేశారన్నారు. 6 వందల 25 కోట్లు ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు డబ్బులు అందించామన్నారు. బీజేపీ - బీఆర్ఎస్ పార్టీ నాయకులు



రైతుల మనోధైర్యం దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. గతంతో పోల్చితే ఉత్పత్తి, కొనుగోళ్లు పెరిగాయన్నారు. అధికారం పోయినంత మాత్రాన ఇంతగనం ఆందోళన అవసరం లేదన్నారు. వాళ్ళ పార్టీలో ఆధిపత్యపోరు కోసం రైతులను ఇబ్బంది పెట్టకండి అని సూచించారు. రైతుల పై ఒత్తిడి లేదు.. ఓపెన్ మార్కెట్ లో అవకాశం ఉన్నా అమ్ముకోవచ్చన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే ప్రతీ గింజా మేము కొంటామన్నారు. కేంద్రం గైడ్లెన్స్ లో మార్పులు చేయాలని కోరుతున్నామని తెలిపారు.

# ఏఐసీసీలో ఖర్గే ఓ బొమ్మ మాత్రమే..

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

శీతాకాల సమావేశంలో వక్ఫ్ బోర్డు బిల్లు పార్లమెంట్‌లో పాస్ అవుతుందని అన్నారు చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం ముస్లిం సమాజానికి వ్యతిరేకం కాదని తెలిపారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో వక్ఫ్ మతం కిందకు రాదని చెబుతున్నాయని, వక్ఫ్ అనేది ఇతర దేశాల్లో ప్రభుత్వం కిందనే ఉందని తెలిపారు. ఎవరడ్డుకున్నా వక్ఫ్ బోర్డు సవరణ జరుగుతుందని చెప్పారు. ప్రజాస్వామ్యంలో సుప్రీంకోర్టు కీలకమని.. ఎవరైనా సర్వోన్నత న్యాయస్థాన తీర్పును గౌరవించాల్సిందేనని అన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డును తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. దీనికి సుప్రీంకోర్టుకు మించి అధికారలిచ్చారని విమర్శించారు. ఔరంగజేబు విధానాలు ఇప్పటికీ ప్రజలను పీడిస్తున్నాయని పేర్కొన్నారు. '300 వందల ఏళ్ల క్రితం కింద ఔరంగా జేబు నోటి మాటతో భూమిలిచ్చి ఉండొచ్చు, కానీ నేడు కుప్పలువుకుప్పలుగా డాక్యుమెంట్స్‌తో భూములు మావని అంటున్నారు. వక్ఫ్ బోర్డు అనేది ఒక క్రూరమైన హాస్యం, నవ్వాలో, ఏడ్వాలో, బాధపడాలో తెలియని పరిస్థితి.



దేవాలయం అనేది మతానికి సంధించింది. వక్ఫ్ ఆనేది సమాజానికి సంబంధించినది. ముస్లిం ఓట్ల కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ దేశాన్నైనా అమ్ముకుంటాయి. ఏఐసీసీలో ఖర్గే ఒక బొమ్మ మాత్రమే. నాడు మన్మోహన్ సింగ్‌ను ఎలా వాడుకున్నారో నేడు ఖర్గే కూడా అలాగే వాడుకుంటున్నారు.రాహుల్ తాత నెహ్రూ హాయంలో పాలేకర్ కమిషన్ ఏర్పాటు చేశారు. 1980 మండల్ కమిషన్ ఏర్పాటు చేశారు, ఎలాంటి చర్యలు లేవు. రాహుల్ తండ్రి రాజీవ్ గాంధీ విధానాలు నచ్చక అంబేద్కర్ కేబినెట్ వదిలేసి వెళ్లిపోయారు. రాజ్యాంగాన్ని బొంద పెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది' అని మండిపడ్డారు.

# 'పట్నం' కోసం రంగంలోకి బీఆర్ఎస్ లీగల్ టీమ్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

బీఆర్ఎస్ నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌ను హైకోర్టు రిజిస్ట్రీ తిరస్కరించింది. ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాది హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం కోర్టుకు సెలవు కావడంతో హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం చర్లపల్లి జైలులో ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి నేరస్తులతో కలిపి ఉంచారని పిటిషన్ వేశారు. స్పెషల్ బ్యారక్‌లో పట్నం నరేందర్‌ను ఉంచాలని న్యాయవాది కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రీ రిజక్ట్ చేసింది. లగచర్లలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారులపై దాడికి పాల్పడ్డ కేసులో నరేందర్‌రెడ్డిని వికారాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో ఆయనను పోలీసులు అదుపులో తీసుకున్నారు. అక్కడి నుంచి వికారాబాద్‌లోని పోలీస్ ఆఫీస్‌కు, తర్వాత జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. రిమాండ్ రిపోర్టులో ఆయనను ఏ1గా చేర్చారు. కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లో తానే సురేష్‌తో దాడి చేయించానని, ఆర్థికంగా సహకరించారనని నరేందర్ రెడ్డి ఒప్పుకోవడంతో ఏ1గా ఆయనను చేర్చినట్లు, ఏ2గా సురేష్‌ను మార్చినట్లు పోలీసులు వెల్లడించారు. అంతకు ముందు వరకు సురేష్ పేరు ఏ1గా ఉండేది. బుధవారం సాయంత్రం కొండగల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట నరేందర్‌రెడ్డిని హాజరుపరచగా 14






రోజుల రిమాండ్ విధించారు. దీంతో నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా, కలెక్టర్, జిల్లా అధికారులపై దాడి ఘటనలో తన పాత్ర ఉందంటూ పోలీసులు కట్టు కథ అల్లారని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆదేశాలతో రైతులను దాడులకు పురికొల్పినట్లుగా తాను నేరాంగీకార ప్రకటన ఇచ్చానని పోలీసులు చెబుతున్నట్లు తెలిసిందన్నారు. చర్లపల్లి జైల్లో ఉన్న నరేందర్‌రెడ్డి.. ఈ మేరకు గురువారం తన న్యాయవాదుల ద్వారా కొడంగల్ కోర్టును ఉద్దేశించి అఫిడవిట్ పంపించారు. బుధవారం ఉదయం హైదరాబాద్‌లో మార్నింగ్ వాక్ చేస్తున్న తనను పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా బలవంతంగా వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి నిర్బంధించినట్లు తెలిపారు.

మేం అధికారంలోకి వచ్చాక

# మీ సంగతి చెబుతాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చినప్పుడు ఆందోళనలో పాల్గొన్నవారిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఉన్నారని తెలిపారు. లగచర్ల ఘటనలో కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారన్నారు. కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలను మాత్రమే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఎద్దేవా చేశారు. ఈ ఘటనకు సీఎం కావాలనే రాజకీయ రంగు పులిమారన్నారు. తన పదవి ఐదేళ్లే ఉంటుందని రేవంత్ రెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. కొడంగల్‌ను అల్లుడి ఫార్మా కంపెనీకి రాసివ్వాలని సీఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎకరం రూ.60 లక్షల భూమిని రూ.10 లక్షలకే లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పేదవాడి కన్నీళ్ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. రేవంత్ రెడ్డికి చేతనైతే తమతో కొట్లాడాలి తప్ప అమాయకులతో కాదన్నారు.

# నగరంలో సెమీ కండక్టర్స్ ఆర్అండ్‌డీ సెంటర్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

వందేళ్ళ చరిత్ర కలిగిన అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లోని సెమీ కండక్టర్స్ ఆర్అండ్‌డి సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. హైదరాబాద్‌లో అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ కొత్త ఆర్అండ్‌డీ సెంటర్ ప్రకటించింది. ఆటోమోటివ్ సెమీకండక్టర్‌స్‌లో గ్లోబల్ లీడర్, టెస్లా, టాటా వంటి అగ్ర ఈవీ బ్రాండ్‌లకు కీలకమైన సరఫరాదారు అయిన అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్‌లో అత్యాధునిక ఆర్అండ్‌డీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈవీ, ఆటోమోటివ్ పరిశ్రమల్లో భారతదేశం యొక్క సెమీకండక్టర్ పర్యావరణ వ్యవస్థ కోసం ఈ ప్రధాన మైలురాయిని ప్రకటించినందుకు మంత్రి అభినందించారు. వందేళ్ళ చరిత్ర కలిగిన అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్ లోని సెమీ కండక్టర్స్ ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతోందన్నారు. వచ్చే ఐదు ఏళ్లలో 500 మందికి ఉపాధి కల్పించే లక్ష్యం అన్నారు. ఇండియాలో ఎన్నో ప్రధాన నగరాలను కాదని హైదరాబాదులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చారని తెలిపారు. ప్రభుత్వపరంగా వారికి అన్ని విధాలా పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఇక్కడున్న ఎకో సిస్టం, స్కిల్ వర్కర్ల అవైలబిలిటీ, గవర్నమెంట్ పాలసీస్ ఇవన్నీ వ్యాపారానికి చాలా అనుకూలంగా ఉన్నాయన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్ రంగంలో సెమీ కండక్టర్ల వినియోగం విరివిగా పెరుగుతుందన్నారు. ఆటోమేటివ్ ,ఇండస్ట్రీస్ రంగాలలో సెమీ కండక్టర్ల వినియోగంపై గ్లోబల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ చేస్తారని తెలిపారు. అలెగ్రో మైక్రో సిస్టమ్స్ మ్యాగ్నెటిక్ సెన్సార్, పవర్ ఐసి మ్యానుఫ్యాక్చరింగ్ లో గ్లోబల్ లీడర్స్ అని తెలిపారు. ఈ రంగానికి చెందిన అతిపెద్ద కంపెనీ తెలంగాణకు రావడం చాలా సంతోషమని తెలిపారు.

# కేసీఆర్‌ను కేటీఆర్ నిర్బంధించారు

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

పదేళ్ల బీఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై తాము చర్చకు సిద్ధమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఫార్మా సిటీ ఒక్కచోట ఉండకూడదనే వికేంద్రీకరణ చేశామన్నారు. లగచర్లలో భూమిలేని వారు అధికారులపై దాడి చేశారని, కేటీఆర్ ఉద్దేశపూర్వకంగా దాడి జరిపించాడని ఆరోపించారు. ఫార్ములా వన్ రేసులో చేసిన తప్పేంటో కేటీఆర్‌కు తెలుసని, ఆయన తప్పు చేశాడని ఫీలవుతున్నాడు కాబట్టే జైలుకుపోతా అంటున్నాడని తెలిపారు. శుక్రవారం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ కేసీఆర్ ఫ్యామిలీని జైలుకు పంపడం లేదేంటని ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో అవినీతి అధికారులపై పద్ధతి ప్రకారం చర్యలు ఉంటాయని వెల్లడించారు. ప్రతిపక్షహోదా ఉన్నప్పటికీ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఏడాదిగా బయటకు రావడం లేదన్నారు. ఆయన ఎక్కడ దాకున్నారని ఆయన ప్రశ్నించారు. 'కేసీఆర్‌ను కేటీఆర్ నిర్బంధించారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ కంటే మేము 9 నెలల్లో ఎక్కువ చేశాం. నిర్బంధ పాలన నుంచి ప్రజా పాలన తీసుకొచ్చాం. అందుకే బీఆర్ఎస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ప్రజలు కోరినట్లు పాలన సాగింది కాబట్టే విజయోత్సవాలు చేస్తున్నాం. బీఆర్ఎస్ హయాంలోని అవినీతి అధికారులపై చర్యలు ఉంటాయి. హైడ్రా అనేది హైదరాబాద్ నగరానికి ఒక వరం. ఆక్రమణలకు గురైన చెరువులు, కాలువలను పూర్తిగా బాగు చేస్తే.. వయనాడ్‌లో చోటుచేసుకున్న ఉపద్రవాలు ఇక్కడ వచ్చే అవకాశం ఉండదు. భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. మూసీ ప్రక్షాళన అవసరం. పేదలెవరూ నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం పునరావాస చర్యలు తీసుకుంటుంది' అని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు.

# సింపతీ కోసమే కేటీఆర్ అరెస్ట్ డ్రామా

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతోంది. రైతుల ముసుగులో కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నాలు చేస్తున్నాయి. లగచర్ల ఘటనలో కేటీఆర్ ఉన్నట్టు వారి పార్టీ నాయకులే అంటున్నారు. కేటీఆర్ పదే పదే అరెస్ట్ అనడం కేవలం సానుభూతి కోసమే. ఆయనను అరెస్ట్ చేయడానికి మేమేమీ కుట్రలు చేయడం లేదు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తి అయ్యాక అన్ని విషయాలు బయటకు వస్తాయి. గత పదేళ్లలో రైతులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తోంది. సన్న వడ్లు పండించిన ధాన్యానికి 500 బోనస్ ఇస్తున్నాం. ధాన్యం సేకరించిన వారం రోజులలోపే ఐదు వందల బోనస్ రైతులకు అందుతాయి. రైతుల విషయంలో ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారం ఆపాలి. ఇప్పటి వరకు 33కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేసేందుకు ప్రాసెస్ జరిగింది. 66 లక్షల ఎకరాల్లో 140 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. కాళేశ్వరంతోనే నీళ్లు ఇచ్చాం అన్నారు.. మరి ఈ ధాన్యం ఉత్పత్తి కాళేశ్వరంతో కాలేదు కదా?. కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం చేశారు. బీజేపీ తమ బాధ్యతలను విస్మరిస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్రాలకు వెసులుబాటు కల్పించాలి. గత ప్రభుత్వ హయంలో గుట్టలకు, పుట్టలకు, చెట్లకు రైతుబంధు ఇచ్చారు. ఇలాంటి విధానాన్ని మేము కొనసాగించం.. నిజమైన రైతులకు న్యాయం చేస్తాం' అంటూ కామెంట్స్ చేశారు.



# అక్రమాలపై ఉక్కు పాదం మోపడమే లక్ష్యం

## ప్రజాస్వరం ప్రత్యేక ఇంటర్వ్యూలో తూప్రాన్ సీఐ రంగాకృష్ణ



**తూప్రాన్, నవంబర్15, ప్రజాస్వరం :** అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలతో అక్రమంగా వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్న మట్టి మాఫియాపై దాడి చేసి కేసులు నమోదు చేసి అక్రమాలకు అడ్డుకట్టపడేలా చేశారు. కొన్నేళ్ల కాలంగా పచ్చని కుటుంబాలు విచ్ఛిన్నానికి కారణమవుతున్న చిత్తుబొత్తు ఆటపై దాడి చేసి పలువూరి పై కేసు నమోదు చేశారు.చాప కింద నీరులా ఒకరి నుంచి ఒకరు గంజాయికి అలవాటుపడుతూ చిన్నతనంలోనే చదువులకు దూరం అవుతూ ఎన్నో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాల్సిన మంచి జీవితాలను పాడు చేసుకుంటున్నారు. గంజాయి ముఠాను అరెస్టు చేయడం తో పాటు పేకాట రాయుళ్లను గుర్తించి కేసులు నమోదు చేశారు. జిల్లాలోనే అద్భుత పనితీరుతో జిల్లా ఎస్పీ చేతులమీదుగా ఉత్తమ నగదు రివార్డు అందుకున్న తూప్రాన్ సీఐ రంగా కృష్ణతో ప్రజాస్వరం ప్రతినిధి ప్రత్యేక ఇంటర్వ్యూ..







**ప్రజాస్వరం ప్రశ్న :** నెల రోజుల వ్యవధిలో ఇన్ని కేసులను ఎలా చేదించగలిగారు.

**సమాధానం :** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తూప్రాన్ సర్కిల్ పరిధిలో ఉన్న అక్రమాలు అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాం. సిబ్బంది సహకారంతో నెలరోజుల్లోనే 4 కేసులను ఛేదించి అక్రమాలకు అడ్డు కట్టపడేలా చేశాం.

**ప్రజాస్వరం ప్రశ్న:** ఉమ్మడి తూప్రాన్ మండలంలోని గంజాయి ఎక్కువ వినియోగిస్తున్నట్లు తెలుస్తుంది, దీనిని అరికట్ట వేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

**సమాధానం :** ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి ఎక్కువగా తీసుకొచ్చి ఇక్కడ యువతకు అలవాటు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఎవరైతే సరఫరా చేస్తున్నారో వారి మూలాలను తెలుసుకునేందుకు నిఘా పెట్టాం. ఆ సరఫరాదారులు స్థానిక యువకులకు విక్రయించడంతో వారు వినియోగించడంతో పాటు ఇతరులకు విక్రయాలు చేపడుతున్నట్లు తెలిసింది. దీనికి త్వరలోనే పూర్తిస్థాయిలో అడ్డుకట్టపడేలా సమిష్టిగా కృషి చేస్తాం.

**ప్రజాస్వరం ప్రశ్న:** తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో మట్టి అక్రమ రవాణా విపరీతంగా కొనసాగుతుంది దీనిని ఎలా అరికట్ట గలుగుతారు

**సమాధానం :** తూప్రాన్ మనోహరాబాద్ మండలాల్లో 15 రోజుల వ్యవధిలో 20 కి పైగా టిప్పర్లను పట్టుకుని కేసులు నమోదు చేశాం. ఎక్కడ అక్రమంగా మట్టి తరలిస్తున్నారని సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని కేసులు నమోదు చేస్తాం. ఈ విషయంలో ఎలాంటి రాజకీయ వ్యక్తులకు తలొగ్గకుండ శాశ్వత పరిష్కా రానికి చర్యలు తీసుకుంటాం.

**ప్రజాస్వరం ప్రశ్న:** ఫామ్ హౌస్‌లో పేకాట జోరుగా నడుస్తుంది దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

**సమాధానం :** తూప్రాన్ సర్కిల్ పరిధిలో ఉన్న గ్రామల శివారులో వ్యవసాయ పొలాల వద్ద ఇటీవల ఫామ్ హౌస్లలో ఎక్కువగా పేకాట ఆడుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. హైదరాబాద్ కు చెందిన స్థిరాస్తి వ్యాపారులు రాజకీయ నాయకులతో పాటు స్థానికంగా ఉన్నటువంటి పలువురు పేకాట ఆడుతున్నట్లు తెలుస్తుంది. కొద్ది రోజుల క్రితం శివంపేట మండలం శభాష్ పల్లి శివారులోని ఫామ్ హౌస్ లో ఆకస్మిక దాడులు చేసి ఏడుగురుపై కేసులు నమోదు చేసి 1,07,500 రూపాయలు నగదు సీజ్ చేశాం.ఎక్కడైనా పేకాట ఆడితే సమాచారం ఇవ్వాలి.


## ఆరుతడి పంటలపై రైతులకు అవగాహన

**చిన్న శంకరంపేట (ప్రజా స్వరం) :** చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామంలో సెహగల్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఎప్పటికీ ఒకే రకమైన పంట వేస్తే భూమిలో పోషక పదార్థాలు తగ్గి పంట దిగుబడి తక్కువ అవుతుందని పంట మార్పిడి పై రైతులకు సెహగల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రాఘవేందర్ పలు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ చిలుక నాగరాజు సేహగల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రాఘవేందర్‌లు మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశంతోనే సేహగల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలు రకాల పంటలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. పంట మార్పిడి చేసుకుంటే భూమిలో పోషక పదార్థాలు పెరిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుందని, ఒకే రకమైన పంట వేస్తే పంట దిగుబడి తగ్గుతుందని దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. రైతులు వరి కాకుండా ఇతర పంటలు వేస్తే 1875 రూపాయలు చెల్లిస్తే వారికి స్వచ్ఛంద సంస్థ ద్వారా పదివేల రూపాయల విలువగల విత్తనాలతో పాటు పీవోటీ కిట్ అందిస్తున్నామన్నారు. కూరగాయల పంటలు వేస్తే రైతులకు ఆదాయం కూడా పెరుగుతుందని, రైతులు ఆర్థికంగా ఎదగడం కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సేహగల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు రాఘవేందర్, మాజీ సర్పంచ్ చిలుక నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ సిద్దిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, బక్కన్న, యాదగిరి, రామస్వామి, వెంకటేష్, ముత్యాలు, ప్రభాకర్, దుర్గయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



## చీర్యాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

**కీసర, నవంబర్ 15 (ప్రజా స్వరం) :** కీసర మండలం చీర్యాల గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శించుకుని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి, భక్తులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ





**చిన్న శంకరంపేట, (ప్రజాస్వరం) :** చిన్న శంకరంపేట్ మండలం గజగట్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని పలువురు బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. గజగట్లపల్లి బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బండారి యాదగిరి కుమారుడు అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన బత్తిని రమేష్ ఇటీవల ప్రమాదంలో చేయి విరిగడంతో బాధితుడిని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన ఐరేని నరేష్, ఐరేని సురేష్ తల్లి గత కొద్ది రోజుల క్రితం మరణించడంతో వారి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు రవీందర్, నాగభూషణం, యాదగిరి, శంకర్, రాజు, శ్రీకాంత్, రమేష్, బాలగౌడ్, యాదగిరి, నవీన్, బాలమల్లయ్య, నాగరాజు, రాజకుమార్, మణికుమార్, స్వామి, రంజిత్ పాల్గొన్నారు.

## వన దుర్గమ్మను దర్శించుకున్న ఎస్పీ దంపతులు

**మెదక్, నవంబర్ 15 (ప్రజా స్వరం) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పాపన్నపేట మండలం నాగసాన్‌పల్లి గ్రామం ఏడుపాయల వనదుర్గా మాతను మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వనదుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ సిబ్బంది వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎస్పీ వెంట స్థానిక ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్, ఆలయ సిబ్బంది ఉన్నారు.





# ఘనంగా కార్తీక పౌర్ణమి

**మెదక్, నవంబర్ 15 (ప్రజా స్వరం) :**
కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రం కోదండ రామాయలయంలో ఆలయ ప్రధాన అర్చకులు భాష్యం మధుసూదనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దీపోత్సవ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బండ నరేందర్, కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.









## వైభవంగా కార్తీక పౌర్ణమి

**కీసర, నవంబర్ 15 (ప్రజా స్వరం) :**
నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి శ్రీభవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా గ్రామ పురోహితులు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని భవానీ రామలింగేశ్వర స్వామి అర్ధనారీశ్వర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం దశ సహస్ర (10,000) దీపార్చన నిర్వహించారు. కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో చేసి స్వామివారి దర్శించుకొని ప్రత్యేక అభిషేక నిర్వహించి ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సరితారమేష్, నాగేష్‌గౌడ్, కళావతి యాదగిరి, లక్ష్మీవేణు, కో ఆప్షన్ సభ్యులు అశోక్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ రామకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## రెండు ఉద్యోగాలు సాధించిన
# అర్ఫానా బేగం





**శామీర్‌పేట, నవంబర్ 15(ప్రజా స్వరం) :**
మూడుచింతలపల్లి మండలం అనంతారం గ్రామానికి చెందిన మొహమ్మద్ ఆజం కూతురు మొహమ్మద్ అర్ఫానా బేగం టీజీపీఎస్సీ నిర్వహించిన పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు ద్వారా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం పొంది శిక్షణ కూడా ఈ నెల 21తో ముగుస్తుంది. అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గ్రూప్ 4 ఫలితాల్లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించింది. తన కూతురు రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల మొహమ్మద్ ఆజం సంతోషం వ్యక్తం చేశాడు.

## కొండపోచమ్మ దర్శించుకున్న
# కాంగ్రెస్ యూత్ నాయకులు

**జగదేవ్‌పూర్, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**
జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గల కార్తిక పౌర్ణమి సందర్భంగా కొండపోచమ్మ ఆలయాన్ని కాంగ్రెస్ యూత్ నాయకులు గుర్రం అశోక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి మొక్కలు చెల్లించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో
# వ్యక్తి మృతి
### మరొకరికి తీవ్రగాయాలు

**చిన్న శంకరంపేట, నవంబర్ 15 (ప్రజాస్వరం) :**
చిన్న శంకరంపేట మండలం సూరారం గ్రామ శివారులో రెండు బైకులు ఢీకొనడంతో సూరారం గ్రామానికి చెందిన గజం కిషన్ చేగుంట మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన రమేష్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన ఇరువురిని 108 అంబులెన్స్‌లో మెదక్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిషన్ మృతి చెందడంతో గ్రామంలో ఒక్కసారిగా విషాద చాయాలు అలముకున్నాయి. కిషన్ గ్రామంలో అందరితో కలిసి మెలిసి ఉండేవాడని ఒక మంచి వ్యక్తిని కోల్పోవడం జరిగిందని, కిషన్ మృతి చెందడం చాలా బాధాకరమని, మృతుడి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ చిలుక నాగరాజు, మాజీ ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డిలు పరామర్శించారు.

## 'కోటి దీపోత్సవం' వేడుకకు
# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**
భక్తి టీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'కోటి దీపోత్సవం' వేడుకలు హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవంబర్ 9న ఆరంభమైన ఈ దీపాల పండుగ దిగ్విజయంగా కొనసాగుతోంది. హైదరాబాద్ సహా రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కోటి దీపోత్సవ వేడుకకు చేరుకున్నారు. కాగా.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న రేవంత్.. ఉజ్జయిని మహాకాళేశ్వరుడికి హారతి సమర్పించారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నేడు తిరువణ్ణామలై శ్రీ అరుణాచలేశ్వర స్వామి కల్యాణంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం వేదికపై స్వర్ణలింగానికి రజత బిల్వార్చన, అష్టోత్తరశత స్వర్ణపుష్పార్చన జరిపారు. దీంతో పాటు పూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ (అవధూత దత్తపీఠం, మైసూరు) అనుగ్రహ భాషణం చేశారు. మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ డా. గరికిపాటి నరసింహారావు ప్రవచనామృతం వినిపించారు. భక్తులచే మహాకాళేశ్వరునికి కోటి పుష్పార్చన చేయించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 15 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

# ఫిలిప్పీన్స్ లో వైద్యవిద్యార్థిని అనుమానాస్పద మృతి

**శుక్రవారం తెల్లవారుజాము చనిపోయినట్లు తల్లిదండ్రులకు సమాచారం**

పటాన్ చెరు : వైద్య విద్యను అభ్యసించడానికి ఫిలిప్పీన్స్ దేశానికి వెళ్లి అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి చెందిన ఘటన పటాన్చెరు ప్రాంతంలో విషాదం నింపింది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం ఇంద్రేశం గ్రామ పంచాయతీ పరిధిలో నివాసముంటున్న చింత అమృత్ రావు కుమార్తె చింత స్నిగ్ధ (17) ఫిలిప్పీన్స్ దేశంలోని పర్పెక్చువల్ హెల్త్ యూనివర్సిటీ మనీలాలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అయితే స్నిగ్ధ పుట్టినరోజు నాడే అనుమానాస్పదంగా మృతి చెందినట్లు చెబుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో స్నిగ్ధ చనిపోయినట్లు అక్కడ తోటి విద్యార్థినిలు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. విద్యార్థిని మృతి వార్తతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగిపోయారు. మృతురాలు స్నిగ్ధ తండ్రి అమృత్ రావు విద్యుత్ శాఖలో డీఈ గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



## గురుపరబ్ పర్వదిన శుభాకాంక్షలు



ఏక్ ఓంకార్ సందేశంతో మానవాళికి సమానత్వాన్ని ప్రబోధించిన సిక్కు మత స్థాపకులు గురునానక్ గారి జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలోని తన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారితో కలిసి ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

హైదరాబాద్ : దేవుడు ఒక్కడే అని ఏక్ఓంకార్ సందేశంతో సమానత్వాన్ని బోధించి మానవాళికి సత్యం, అహింసలతో కూడిన ప్రేమ మార్గాన్ని గురునానక్ దేవ్ చూపించిరని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా మహనీయులను స్మరిస్తూ ప్రజలందరికీ గురుపరబ్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## జీవితాల్లో వెలుగులు నింపాలి

**ప్రజలకు సీఎం రేవంత్ కార్తీక పూర్ణమి శుభాకాంక్షలు**


హైదరాబాద్ : పవిత్రమైన కార్తీక దీపకాంతులు అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కార్తీక సోమవారం సందర్భంగా ప్రజలందరికీ కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ పరమేశ్వరుడి కృపాకటాక్షాలు ప్రతి కుటుంబంపై ఉండాలని కోరుకున్నారు.




## నిత్యం ప్రజాసేవలో నిమగ్నం

**మంత్రి తుమ్మలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం**

హైదరాబాద్ : వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రిమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సీఎం రేవంత్ హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.




**మూసీ ప్రక్షాళన అడ్డుకుంటే బుల్డోజర్ తో తొక్కిస్తాని రేవంత్ వ్యాఖ్యలపై**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం**

కాంగ్రెస్, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటే

పంటల బోనస్ బోగస్ చేసిన హస్తం పార్టీ

కాంగ్రెస్ కు ఏటీఎంగా తెలంగాణ అని విమర్శ

# సీఎం అలా మాట్లాడొచ్చా?



హైదరాబాద్ : పంటలకు బోనస్ అన్నారు బోగస్ చేశారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి .. కాంగ్రెస్ సర్కారుపై మండిపడ్డారు. హామీ ఇచ్చినమేరకు బోనస్ ఇచ్చే సత్తా ఈ ప్రభుత్వానికి లేదన్నారు. గతంలో ఫామ్ హౌస్ లో వీడియోలు తీసి బీఆర్ఎస్ ఏ విధంగా ఉపయోగించుకుందో రేవంత్ అలానే చేస్తున్నారని చెప్పారు. ఆలయాలపై దాడులు జరుగుతుంటే పోలీసులు ప్రభుత్వం ఏం చేస్తోందన్నారు. మజ్లిస్ పార్టీ ఆదేశాలతో పోలీస్ కమిషనర్ ను బదిలీ చేశారన్నారు. చర్చల ద్వారా పరిష్కరించాల్సిన వ్యవహారం కలెక్టర్ పై దాడి వరకు వచ్చిందన్నారు.

సీఎం సొంత నియోజకవర్గంలోనే దాడి జరగడం, రైతులను అరెస్టు చేయడం ఎక్కడికి వెళ్తోంది తెలంగాణ అన్నారు. పోలీస్ వ్యవస్థను కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు ఒక్కటే.. వారి డీఎన్ఏ ఒక్కటే అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బస్తీ దవాఖానాలు నడుస్తున్నాయన్నారు. తెలంగాణలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదున్నారు. పేదల ఇళ్లు కూలగొట్టకుండానే మూసీ ప్రక్షాళన చేయొచ్చన్నారు. దీన్ని అడ్డుకుంటే బుల్డో జర్ తో తొక్కిస్తా అని సీఎం స్థాయి వ్యక్తి మాట్లాడొచ్చా? అని ప్రశ్నించారు. తెలంగాణకు పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్కు ఏటీఎంగా తెలంగాణ రాష్ట్రం అన్నారు.

హరియాణా, పంజాబ్‌ను

# అధిగమించాం

**ధాన్యం ఉత్పత్తిపై మంత్రి తుమ్మల**

**రైతులకు అందుబాటులో 7,411 కేంద్రాలు**

హైదరాబాద్: తెలంగాణలో ప్రస్తుతం కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశం తెలిపారు. గతంలో కోటి 46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి ఉండేదన్నారు. సన్న ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించామని చెప్పారు. సన్న ధాన్యానికి బోనస్ ప్రకటించడం వల్ల ఉత్పత్తి పెరిగిందని వివరించారు. సంక్రాంతి నుంచి ప్రజలకు సన్నబియ్యం ఇవ్వలని సంకల్పించామని మంత్రి స్పష్టం చేశారు.



**ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకు యత్నం**

ధాన్యం ఉత్పిత్తిలో హరియాణా, పంజాబ్ ను అధిగమించామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. సన్న ధాన్యాన్ని ప్రైవేటు మిల్లర్లు పోటీపడి కొంటున్నారు.. గతంలో 4500 కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు జరిగేవన్న మంత్రి తుమ్మల ప్రస్తుతం 7411 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతిపక్షంలోని ప్రబుద్ధులు రైతుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు

# సెమీ కండక్టర్స్ ఆర్ అండ్ డి సెంటర్

**5 ఏళ్లలో 500 మందికి ఉపాధి**


**అలెగ్రోకు సహకరిస్తాం**

**మంత్రి శ్రీధర్**

హైదరాబాద్ : హైదరాబాద్ – వందేళ్ళ చరిత్ర కలిగిన అలెగ్రో మైక్రోసిస్టమ్స్ హైదరాబాద్ లోని సెమీ కండక్టర్స్ ఆర్ అండ్ డి సెంటర్ ను ఏర్పాటు చేయబోతోందని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆటోమోటివ్ సెమీకండక్టర్స్‌లో గ్లోబల్ లీడర్, టెస్లా, టాటా వంటి అగ్ర ఈవీ బ్రాండ్‌లకు కీలకమైన సరఫరాదారు అయిన అల్లెగ్రో మైక్రోసిస్టమ్స్ ఈ సెంటర్ ఏర్పాటుకు ఆమోదముద్ర వేసిందన్నారు. వచ్చే5 ఏళ్లలో 500 మందికి ఉపాధి కల్పించే లక్ష్యం అన్నారు.

ఇండియాలో ఎన్నో ప్రధాన నగరాలను కాదని హైదరాబాదులో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వచ్చారని తెలిపారు.

ప్రభుత్వపరంగా వారికి అన్ని విధాలా పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఇక్కడున్న ఎకో సిస్టం, స్కిల్ వర్కర్ల అవైలబిలిటీ, గవర్నమెంట్ పాలసీస్ ఇవన్నీ వ్యాపారానికి చాలా అనుకూలంగా ఉన్నాయన్నారు. దేశంలో ఎలక్ట్రానిక్ రంగంలో సెమీ కండక్టర్ల వినియోగం విరివిగా పెరుగుతుందన్నారు. ఆటోమేటివ్ ,ఇండస్ట్రీస్ రంగాలలో సెమీ కండక్టర్ల వినియోగంపై గ్లోబల్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ చేస్తారని తెలిపారు. అలెగ్రో మైక్రో సిస్టమ్స్ మ్యాగ్నెటిక్ సెన్సార్, పవర్ ఐసి మ్యానుఫ్యాక్చరింగ్ లో గ్లోబల్ లీడర్స్ అని తెలిపారు. ఈ రంగానికి చెందిన అతిపెద్ద కంపెనీ తెలంగాణకు రావడం చాలా సంతోషమని తెలిపారు.



# కేటీఆర్ ములాఖాత్

**లగచర్ల ఘటనలో అరెస్ట్ అయిన నిందితులకు పరామర్శ**

**కంది జైలు లోపలికి వెళ్లందుకు మాజీ మంత్రి వాహనానికి అనుమతి**

**ఆయన వెంట సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు**

సంగారెడ్డి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కంది సెంట్రల్ జైల్ కు చేరుకున్నారు. కేటీఆర్ వస్తుండటంతో జైలు ప్రధాన ద్వారం వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు అక్కడికి చేరుకున్నారు. ఉన్నతాధికారులు ఈ జైలు పరిధిలోకి ఎవరిని అనుమతించడం లేదు. కేటీఆర్ ముందుగా స్థానికంగా ఉన్న నేతలు, కార్యకర్తలను కలవడానికి కేటీఆర్ వాహనాన్ని మాత్రమే అనుమతించారు. తొలుత హైదరాబాద్ నుంచి సంగారెడ్డి సెంట్రల్ జైలుకి రాగానే కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. కాంగ్రెస్ డౌన్ డౌన్, రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ కార్యకర్తల నినాదాలు చేశారు.

అనంతరం కంది జైలు లోపలికి పోలీస్ బలగాలతో వెళ్లారు. వారిని పరామర్శించి, బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ వారికి భరోసా కల్పించారు. రైతన్నలను జైలులో ములాఖాత్ కోసం వెళ్ళిన బీఆర్ఎస్ పార్టీ నేతల బృందంలో ఉన్న వారు కల్వకుంట్ల తారకరామారావు,



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, చింత ప్రభాకర్, ఎమ్మెల్యే, అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, రమావత్ రవీంద్ర కుమార్, మాజీ ఎమ్మెల్యే దేవరకొండ జాన్సన్ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు, ఖానాపూర్ నియోజకవర్గం ఉన్నారు.

# 2025లో కేసీఆర్ సైలెన్స్ బ్రేక్

**లగచర్ల ఘటన, వరుస కేసులు, డ్రగ్స్ పై కామెంట్స్**

లగచర్ల ఘటన వెనుక ప్రభుత్వ కుట్ర

ఫార్ములా ఈలో ఏ తప్పు చేయలేదు

డ్రగ్స్ ఆరోపణలపై.. రక్తం, వెంట్రుకలు శాంపిల్స్ ఇస్తా

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్ : 2025లో కేసీఆర్ సైలెన్స్ బ్రేక్ అవుతుందని ఒక న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. లగచర్ల ఘటన, వరుస కేసులు, డ్రగ్స్ పై సీరియస్ కామెంట్లు చేశారు. లగచర్ల ఘటన వెనక ముమ్మాటికీ ప్రభుత్వ కుట్ర ఉందన్నారు. ప్రజల కోసం జైలు కెళ్లడానికి సిద్ధం.. దమ్ముంటే అరెస్టుచేయాలని సవాల్ విసిరారు. ఫార్ములా ఈలో తప్పు చేయలేదన్నారు. బ్రాండ్ హైదరాబాద్ కోసమే చెల్లింపులు జరిగాయన్నారు. డ్రగ్స్ అంశంలో నా రక్తం వెంట్రుకలు శాంపిల్స్ ఇస్తానని ఎప్పుడో చెప్పాన్నారు. రేవంత్ సోదరుడు ఏ హోదాలో కలెక్టరేట్లకు వస్తున్నారో చెప్పాలన్నారు. మమ్మల్నే తట్టుకోలేకపోతున్నారు.. కేసీఆర్ వస్తే ఈ సర్కార్ పరిస్థితేంటన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శుక్రవారం 15 నవంబరు 2024 | www.prajaaswaramdaily.com | 4 pm

# ఆటోడ్రైవర్ల భిక్షాటన

**రూ. 12 వేల హామీ నెరవేరలేదని ఆగ్రహం**

హైదరాబాద్ : ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేలు ఇస్తామని ప్రభుత్వం హామీనిచ్చిందని నెరవేర్చాలని ఆటో డ్రైవర్లు భిక్షాటన చేసి నిరసన తెలుపుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏడాదికి రూ. 12 వేల హామీ నెరవేరలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రైవేటు ఫైనాన్షియర్లు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. మూడు రోజులుగా భిక్షటన చేస్తూ నిరసన తెలుపుతున్నారు. చలాన్లతో ట్రాఫిక్ పోలీసులు అధిక వడ్డీలతో ఫైనాన్షియర్లు వేధిస్తున్నారన్నారు.



మహబూబ్ నగర్

# మెడికల్ కాలేజీలో ర్యాగింగ్



## 10 మంది విద్యార్థుల సస్పెండ్

**హాస్టల్ కు వెళ్తున్న జూనియర్లను అడ్డుకొన్న సీనియర్లు**

**డైరెక్టర్ కు ఫిర్యాదు**

**తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్**



మహబూబ్ నగర్ : మహబూబ్నగర్ మెడికల్ కాలేజీలో ర్యాంగింగ్ కలకలం రేపుతోంది. బాధితుల ఫిర్యాదుతో 10 మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసింది కాలేజీ యాజమాన్యం. జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ర్యాంగింగ్ చేశారు. పాలమూరు మెడికల్ కాలేజీలో హాస్టల్ కు వెళ్లే క్రమంలో జూనియర్లను సీనియర్లు అడ్డగించి ర్యాగింగ్ కు పాల్పడ్డారని డైరెక్టర్ రమేశ్ కు ఫిర్యాదు చేయడంతో పది మందిని సస్పెండ్ చేసినట్లుగా తెలుస్తోంది. ర్యాగింగ్ జరిగిన వెంటనే విద్యార్థలందరూ కూడా మొదట డైరెక్టర్ కు తెలిపారు. పేర్లతో సహా వివరాలు గోప్యంగా ఉంచుతామని ఫిర్యాదు చేయండి అని చెప్పడంతో జూనియర్లు అంతా కలిసి సీనియర్లపై ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. వారి తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి ఆ తర్వాత చర్య తీసుకుంటున్నారని తెలిసింది.

## నరేందర్ రెడ్డి పిటిషన్

# తిరస్కరణ

**ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని కోరిన ఆయన తరపున న్యాయవాది**

**తిరస్కరించిన హైకోర్టు రిజిస్ట్రీ**



హైదరాబాద్ : లగచర్ల ఘటనకు సంబంధించి అరెస్టైన పట్నం నరేందర్ రెడ్డిని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచాలని హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు ఆయన తరఫు న్యాయవాది ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. నరేందర్ రెడ్డిని నేరస్థులతో కూడిన బ్యారక్‌లో ఉంచినట్లు అందులో పేర్కొన్నారు. ఆయనకు స్పెషల్ బ్యారక్ ఇవ్వాలని కోరారు. పిటిషన్‌ను పరిశీలించిన హైకోర్టు రిజిస్ట్రీ... దానిని తిరస్కరించింది. అలాగే తనపై కేసును కొట్టివేయాలని కోరుతూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో నిన్న క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తనకు రిమాండ్ విధిస్తూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని కోరారు. ఈరోజు కోర్టుకు సెలవు కావడంతో ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగే అవకాశముంది.

## డిసెంబర్‌లోగా మిగిలిన రైతులకు.. రుణమాఫీ



**త్వరలో రైతు భరోసా కిస్తీ కూడా చెల్లిస్తాం మంత్రి పొంగులేటి**

హైదరాబాద్ : లగచర్లలో భూములు లేని నిరుపేదలను రెచ్చగొట్టారని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నేతల కుట్రను పోలీసులు వెలికితీస్తారన్నారు. తప్పుచేసినవారిని ప్రభుత్వం వదిలిపెట్టదన్నారు. మిగిలిన రైతులకు డిసెంబర్ లోపు పక్కాగా రుణమాఫీ చేస్తామని అన్నారు. మిగిలిన రూ.13 వేల కోట్లు త్వరలోనే చెల్లిస్తామన్నారు. త్వరలో రైతు భరోసా ఒక కిస్తీ చెల్లిస్తామన్నారు మంత్రి పొంగులేటి .

# కులగణనపై తప్పుడు ప్రచారం

**దేశానికి దిక్సూచి ఈ సర్వే**

**30 శాతం పూర్తి**

**11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చిన కాంగ్రెస్**

**మంత్రి పొన్నం**




హైదరాబాద్ : కుల గణనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వేలో ఎలాంటి బ్యాంక్ వివరాలు అడగడం లేదని తెలిపారు. ఇప్పటికి 30 శాతం సర్వే పూర్తయ్యిందని వెల్లడించారు. దేశానికి దిక్సూచిగా సర్వే నిలబడుతుందని స్పష్టం చేశారు. సర్వేను అడ్డుకుంటే తగిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. మా ప్రభుత్వం 11 నెలల్లో 45 వేల ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి పొన్నం తెలిపారు. కుల గణన సర్వే ఎవరికి వ్యతిరేకం కాదని తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని దోభిఘాట్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. దోభిఘాట్ గ్రౌండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని చెప్పారు. కులగణన సర్వేలో బ్యాంకు ఖాతా వివరాలు అడగట్లేదని స్పష్టం చేశారు. కులం వివరాలు చెప్పడం ఇష్టం లేకుంటే 999 ఆప్షన్ ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలో ఎలాంటి అపోహలు వద్దన్నారు. రాజకీయ కుట్ర చేసేవారే వీటిని సృష్టిస్తున్నారని చెప్పారు. కులగణన సర్వే వల్ల కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టవచ్చని పొన్నం ప్రభాకర్ తెలిపారు.

# రేవంత్ ఓ రాబందు

**వేల ఎకరాలు ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారు**

**రాజ్యాంగేతర శక్తిగా వ్యవహరిస్తున్న ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి**

**ఇవాళ కొడంగల్ .. రేపు తెలంగాణ తిరగబడతదని కేటీఆర్ వ్యాఖ్య**

హైదరాబాద్: కష్టపడి సాధించుకున్న తెలంగాణలో రేవంత్ రాబందులా మారారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. గతంలో రేవంత్ రెడ్డి ఫార్మా కంపెనీలను విమర్శించారు.. ఇప్పుడు రేవంత్ రెడ్డి ఫార్మా కంపెనీలకు వేలఎకరాలు కావాలంటున్నారని ప్రశ్నించారు. కులగణనలో పాల్గొన్న వ్యక్తిని కూడా అక్రమంగా అరెస్టు చేశారు. వేరేచోట ఐటీఐ చదువుకుంటున్న విద్యార్థిని కూడా అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు కూడా ఆందోళనలో పాల్గొన్నారని కేటీఆర్ సూచించారు. సీఎం అన్న తిరుపతిరెడ్డి రాజ్యాంగేతరశక్తిగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తిరుపతిరెడ్డి ఫోన్ లో ఆదేశాలిస్తున్నారు.. అధికారులు పాటిస్తున్నారని విమర్శించారు. దాడులు చేస్తూ వీడియోల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను వదిలేశారని, కేవలం బీఆర్ఎస్ కార్యకర్తలనే అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



**చేతనగానితనం**

చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకే రేవంత్ సర్కార్ ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. కావాలనే సీఎం ఈ ఘటనకు రాజకీయ రంగు పులిమారు.. తన పదవి ఐదేళ్లే అని రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు. కొడంగల్ ను అల్లుడి ఫార్మా కంపెనీకి రాసివ్వాలన్నదే రేవంత్ ప్రయత్నం అన్నారు. ఇవాళ కొడంగల్ తిరగబడ్డది.. రేపు తెలంగాణ తిరగబడతది అని కేటీఆర్ వార్నింగ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డీ.. అధికారంలోకి వచ్చాక నిన్నేంచేయాలో మాకు తెలుసన్నారు. కేసులెన్ని పెట్టినా బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని కేటీఆర్ ధైర్యం చెప్పారు. ఎకరం రూ. 60 లక్షల భూమిని రూ. 10 లక్షలకు గుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. పేదవాడి కన్నీళ్ల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుందన్నారు. రేవంత్ రెడ్డికి చేతనమైతే తమతో కొట్లాడాలి.. అమాయకులతో కాదని సూచించారు.